ఆశగా చూశాడు. అక్కడ ఏమిటో వెదికాడు. పాపం...ఎంత అమాయకుడు కాకపోతే ఈ పరిస్థితుల్లో ఈ విషయాన్ని ఇంత మాయామర్మం లేకుండా చెప్తాడు. పాపం అతను కమలను అనుమానించలేదు. భార్య అనుమానించి ఉంటుంది. అంతే...ఇలాంటి విషయాలు ఆడవాళ్ళకు ఇట్టే తెలుస్తాయి. అందుకనే ఆమె భర్తనిలా తొందర చేస్తోంది...పాపం పిచ్చిశివరావుకు ఏమిచెప్పను. నువ్వుకూడ నన్ను మోసంచేయాలనుకుంటున్నావా అని చెప్పినా పరిస్థితులకు దాసుడవు నువ్వేంచేస్తావు అని చెప్పనా. కాని నేనుఏమీ చెప్పలేదు. నా గుండెల్ని కాల్చేస్తూన్న దుస్సహమైన ఆ బాధల కార్చిచ్చునుంచి తప్పించుకోడానికి అక్కడ ఇక క్షణంకూడనిలబడకుండా, బయట కామేశ్వర్రావు 'నామాటవిను...నామాటవిను...' అంటూవున్నా ఆగకుండా అక్కడనుంచి పారిపోయాను.

పారిపోతూండగా నా కొక్కసారి, 'కమల ఇందాక చూసి నవ్వింది కామేశాన్ని చూశా... లేక అతడెత్తుకున్న ఆ పాపను చూశా...' అనిపించింది. నా కాళ్లు ఒక్కసారి కుంటువడ్డాయి. నా గుండెల్లో ఏమిటో గతుక్కుమంది. అందుకనే కాబోలు కమల అలా ఆశ్చర్యపోయింది. కమలకు ఆ పాపంటే ఇష్టమేమో...

చీకటి సముద్రంలో నేను అట్టడుగున కొట్టుకుంటున్నాను. ప్రాణం పోవడంలేదు.

గోదావరి స్టేషనులో ఏరైలువస్తే ఆ రైలు ఎక్కివేయడానికి సిద్ధంగా కూర్చున్నాను.

ఇంతలో విచిత్రంగా అక్కడకు శివరావు కామేశ్వర్రావు లిద్దఱూ వచ్చారు. వారి ఈ కలయికను చూసి నేను, 'కలకాదు కదా...' అనుకున్నాను. ఇద్దఱూ, నా దగ్గఱకు నవ్వుతూ వచ్చారు. నా తల పనిచేయడం మానేసింది-

ముందుగా కామేశ్వర్రావు, 'నువ్వు నన్ను క్షమించాలిరా పరాయి వాళ్ళతో ఒక విషయంలో గొడవవస్తే ఇక వాళ్ళను అన్ని విషయాల్లోనూ నీచులుగా చిత్రించే నా మనస్తత్వానికి నువ్వు క్షమించాలి. ఈ విషయాన్ని నువ్వు అర్థం చేసుకుంటే కథంతా ముగిసినట్లే' అన్నాడు.

అప్పుడే శివరావు, 'కామేశ్వర్రావుగారు చెప్పింది నిజమోయ్. మా ఆవిడ ఏమిటో చెప్తే, నేను పిచ్చిగా నమ్మేసి ఇలా కష్టాలను నెత్తిమీదికి తెచ్చుకున్నానోయ్ నిజానికి నేను చాల భయస్తుణ్ణి. సంఘానికిట్టే జడిసిపోయే పిరికివాణ్ణి. పాపం కమల, వీళ్ళ పాపతో ఆడుకోవడంకూడా సహించలేక పోయాను...' అన్నాడు.

ఇక నేనేమి చెప్పను? తుఫానులో చిక్కుకున్న నా యీ ఎదకేమి చెప్పను?

---

స్కెచ్.

# గోవిందరావు మాష్టారు

"మధురశ్రీ"

శ్రీ మహాలక్ష్మీ హైస్కూలు గేటుదగ్గరవుండే ప్యూను వెంకన్న పరిభాష ప్రకారం గోవిందరావు మాష్టరు "డిసీమిసీ" అయ్యారన్న వార్త ఆ స్కూల్ హెడ్‌మాష్టరుగారితో సహా అందరినీ ఆశ్చర్యపరచి, ఆ తర్వాత ఆనందింపజేసింది.

గోవిందరావు మాష్టారంటే సామాన్యులటండీ! నెలకి యిరవైఅయిదు బిళ్ళకుడుముల్లాంటి రూపాయల చొప్పున సమర్పించుకొని, సంవత్సరమంతా ఆయనదగ్గర ప్రయివేటు చెప్పించుకొని ఎస్. ఎస్. ఎల్. సి. తప్పిన వెధవలు...ఆట్టేమాట్లాడితే అంట్లవెధవ... చెవుల్దెగిన వెధవలు... "వంకాయ," "దోసకాయ," యిత్యాది పదజాలం కేవలం ఆయన్ని ఏడిపించేందుకు ఉపయోగిస్తారుగానీ ఆయన మహాత్మ్యం వాళ్ళకేం తెలుసు? (ఈమధ్యన ఒకానొక చలనచిత్ర నిర్మాత "గోవిందరావు మాష్టారి మహాత్మ్యం" అనే పిక్చరు తియ్యడానికి రహస్యంగా హక్కులు పుచ్చుకున్నాడని విశ్వసనీయ వర్గాలద్వారా తెలుస్తూంది.)

ఏ డి.ఇ.ఓ.కి 'అ ఆ'లు కూడా రావో, ఏ డి ఇ.ఓ.గారికి యూపిల్సు యివ్వమో, పాఠం అంతా విని ఏమీ మాట్లాడకుండా 'వర్టికల్ యాక్సిస్'లో 'నార్త్'నుంచి 'సౌత్'కు తలను ఏ డి.ఇ.ఓ. వూపుతాడో, ఎందుకు వూపుతాడో గోవిందరావు మాష్టారుకి తెలుసు. మానేజింగ్ కమిటీ సెక్రటరీగారు ఎన్ని యిళ్లుకట్టించుకున్నారో, కట్టబోయే కాలేజీ హాస్టలు నిర్మాణంలో ఆయన వాటా ఎంతో, ఆయనతాలుకు సుపుత్రికా రత్నాలకి 'ట్యూషను' ఎప్పుడెప్పుడు కావాలో ఆయన తడుముకోకుండా చెప్పగలరు. ఒక్కొక్క హెడ్ మాష్టరు అరవై అయిదుసంవత్సరాలొచ్చినా ఎందుకు రిటైరుకాడో, కళ్ళజోడు క్రిందనుంచీ చూస్తూంటే ఆమాపులు ఎంతవరకూ ప్రసరిస్తాయో రాత్రిళ్లు నిద్రపోతూ "ఫలానా సైన్సుమాష్టర్ని ఆరునూరైనా పర్మనెంటుచేయకూడ"దని ఎందుకు కలవరిస్తాడో— యిత్యాదివిషయాలమీద 'రిసెర్చి' చేసి, "సిద్ధాంతాలని ప్రతిపాదించి, ఋజువు పరచి ప్రపంచానికి ప్రసాదించాలని ఆయనకొక ప్రబలమైన కోరిక వుండేది. "ఎడ్యుకేషనల్ బోర్డ్" రూల్సన్నీ ఆయనకు కంఠోపాఠం. కాని వాటిని "రామునితోక-పివరుండు"అనేటట్లు విడదీసి, ఢంకా బజాయించి, అర్థాలను కల్పించి, స్వార్థానికి వినియోగించుకునే శక్తి ఆయనకున్నది.

ఆ స్కూలులో మాష్టరు గిరీ చెలాయించడానికి వచ్చీరావటంతోటే నాలుగు రోజులు సరిగా పాఠాలుచెప్పి "బాగానే చెప్పా"డని అందరి దగ్గరా సర్టిఫికేటు పుచ్చుకున్నారు. గోవిందరావు మాష్టారు. ఆపేరు కొన్నాళ్ళవరకూ స్థిరంగా నిలచిపోయింది. ఆ తర్వాత టేబుల్ మీద రెండు కాళ్ళూ పెట్టుకొని, ఒక్కసారి ఆవులించి, చిటికవేసి, కళ్ళజోడు బల్లమీదపెట్టి, హాయిగా ఒక యిరవై నిముషాలు కమ్మని నిద్రను అనుభవించే వారాయన. ఆ తర్వాత ఏదో ఒక లెక్కయివ్వటం, అర్థంకాలేదన్న వాడికల్లా "ప్రయివేటుకి రావోయ్" అని ఒక అమూల్యమైన సలహాయివ్వటం ఆయనకు పరిపాటైపోయింది. ఆ ప్రయివేటు కుర్రాళ్ళందరూ షేష్టఫారంవరకు "మోత"గా ప్యాసయ్యేవారుగాని ఆ తరువాత యస్. యస్. యల్ బండీ ఎక్కక తప్పేదికాదు.

సరే! యిక ప్రస్తుత విషయం.

సంవత్సరాంతం పరీక్షలు జరుగుతున్నాయి. ఆ హాల్లో గోవిందరావు మాష్టారొక 'వాచరు.' నిర్ణీత సమయం పూర్తవటానికి ఒక అరగంట వుండనగా, ఆయన దగ్గర ప్రయివేటు చెప్పించుకుంటూన్న విద్యార్థి ఒకడు అంతవరకూ ఒక్కలెక్కయినా సరిగా చేయలేదన్న విషయాన్ని ఆయన పసిగట్టారు. ఒక తెల్ల కాగితంమీద గబగబాగబా నాలుగు లెక్కలు చేసేసి "జాగ్రత్తగా ఎక్కించుకోవోయ్!" అని ఆ విద్యార్థిముందు పడేశారు పరోపకార పరాయణులైన పంతులుగారు. రెండున్నర గంటలు ఒక్క బిగిని కూర్చున్న ఆ విద్యార్థి యిక కూర్చోలేక "మళ్ళీ ఏం కాపీ చేస్తాంలే" అని ఆ కాగితాన్ని కాస్తా తన ఆన్సరు పేపరుతో కలిపి కట్టి, ఇచ్చి, ఆ హాలునుంచీ నిష్క్రమించారు. అయ్యది శ్రీ గోవిందరావుగారి స్వహస్త లిఖితంబని పనికట్టిన ఆ పేపరుదిద్దీ ఆయన అది పుచ్చుకుని హెడ్ మాష్టరుగారి దగ్గరకుపరుగెత్తుకొని పోయి, ఆపేపరు టేబుల్ మీద పెట్టి, సవినయంగా చేతులు కట్టుకొని నిలబడి, మొహంముందుకుపెట్టి "కింకర్తవ్యం?" అన్నాడు. హెడ్ మాష్టరుగారు ప్రప్రథమంలో కొంచెంకంగారు తిని, తర్వాత కాస్త దూరం ఆలోచించి, గోవిందరావు మాష్టారి దగ్గర నుంచీ వచ్చే కూరగాయల "సప్లయ్" ఆగిపోగలదని భయపడి, ఆ విద్యార్థిని ప్యాసుచేసి ఊరుకున్నారు.

మరుసటి సంవత్సరం డి. ఇ. ఓ ఇన్స్పెక్షన్ వరకు మామూలుగానే జరిగిపోయింది. రెండు గంటలూ గోవిదంరావు మాష్టారు చెప్పిన పాఠంవిని, 'వర్టికల్ యాక్సిస్'లో తల ఆడించారు క్రొత్త డి. ఇ. ఓ గారు అప్పుడే అనుకున్నారు గోవిందరావు మాష్టారు కొంపమునిగిందని, అంతవరకూ అంతా సవ్యంగానే గడచిపోయింది. ఇన్స్పెక్షన్ ఆఖరి రోజున క్రిందటి సంవత్సరాంతపు పరీక్షల ఆన్సరు పేపర్లు చూస్తూంటే కర్మకాలి...గోవిందరావు మాష్టారి 'శిష్య పరమాణువు' చేసిన మహత్కార్యం బయటపడిది. మరుసటిరోజు ఉదయానికల్లా గోవిందరావు మాష్టారికి ఆ స్కూలునుంచి "ఉద్వాసన" చెప్పారన్న వార్త అందరికీ తెలిసింది. "గోవిందోహరి"అన్నది విద్యార్థి బృందం. ★